# బ్రహ్మనాయని స్వగతం

## (ఏకపాత్రాభినయం)

**డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.**

**ప్రకాశకులు**

**నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం**

ప్లాట్ నెంబర్. 423, రాజరాజేశ్వరీ నగర్, కొండాపూర్,

హైదరాబాదు - 500 084. ఫోన్ నెంబర్ : 9440495887,9866115177

(Digitised 23 April 2026)

# Brahmanayani Swagatam

# (బ్రహ్మనాయని స్వగతం)

(A Drama)

by **Dr.Nanduri Ramakrishnamacharya**

డిజిలిటీకరణ పర్య వేక్షణ : నండూరి గోవింద రాజు

ప్రతులకు : 1. నండూరి గోవింద రాజు, ప్లాట్ నం .:423,
రాజరాజేశ్వరి నగరు, కొండాపూర్
హైదరాబాద్ -500084.
Cell -9440495887.

Web Site : can down load digital copies at
nanduri.co.in

సర్వ హక్కులు (Copy Rights ) : నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం

# కృతిసమర్పణము

## మిత్రశ్రీ

## డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యంగారికి

*అంకితమగుత చిరస్నే*
*హాంకము స్వర్ణోత్సవోపహార స్రజమై*
*సంకలనముగా నా యే*
*కాంకికలు నవభువనవిజయాధ్యాతునకున్.*

*రాజువుగావుగాని, నటరాజువు నాటకరంగమందు, ఉ*
*త్తేజమునం, దుదారగుణదీధితి, రాజసఠీవియందు ఏ*
*రాజుకు తీసిపోవు; అనురక్తిని ఈ కృతి గొమ్ము, స్వర్ణ నీ*
*రాజన మంగళాశిష విరాజన జన్మదినోత్సవమ్ములో.*

*నీ మది చంద్రికా తరళ నిత్యవసంతమనోజ్ఞ నందనా*
*రామము; దివ్యసౌరభ నిరంతర నాట్యకళాప్రఫుల్లమున్;*
*కోమలభావవీచికలకున్ గిలిగింతలు  పెట్టు ఈ పూరా*
*రామము నీదు  పేరున విరాజిలెడిన్ ప్రతిబింబసామ్యమై.*

# నివేదన

**I**

**"బ్రహ్మనాయని స్వగతం"** ఏకాంకిక 'దశరూపకములు' సంపుటిలో ఒకటి. బ్రహ్మనాయని స్వగతం ఏకపాత్రాభినయం. ఉరికంబం, గీతకత్తి, తమ్ముడు, పద్యంగాని పాటగాని లేని పోడిమాటల ప్రోగులు. గీతకత్తిలో రెండే పాత్రలు. మిగతా ఏకాంకికలలో జ్యోత్స్నాభి సారిక, గోదావరి సంగమం నృత్యనాటికలు. వీరాభిషేకం, త్యాగరాజు గద్య పద్య సంకలితాలు. మరణాంతకం వట్టి ప్రహసనం. ఈ ఏకాంకికలలో ప్రస్ఫుటంగా కనిపించే వైవిధ్యంలో రచయిత ఆత్మీయత వినా, ఏకత్వం మృగ్యం.

**II**

తెలుగుగడ్డ — అవహేళనరూపకం (Satire). ఈ అభూత కల్పన చదివిన దేశభక్తులకు రచయితపై కోపం రావచ్చు. వారిని రచయిత ఉమాభిత అర్థిస్తున్నాడు. కాని, ఒక మనవి. ఆత్మనిష్ఠ యైన అవహేళన ఆరోగ్యలక్షణం. అదిగాక తెలుగుగడ్డలో అవహేళనపూర్వకంగా భాసించే ప్రతి అక్షరం వెనుక రచయిత వేడి కన్నీటిబొట్లు మారువేషంలో దాగియున్నదని మరువవద్దు.

**III**

ఏ నాటకమైనా ఈ జగన్నాటకంలో అంతర్నాటకమే — అనే అనుభూతి పొందినవాడు జీవన్ముక్తుడే. జగన్నాటకాన్ని మించిన నాటకం ఏముంది కన్నుతెరచి చూడగల

సహృదయునికి? వేరే నాటకాలు చదవటం ఎందుకు? ఆడటం ఎందుకు? వ్రాయటం ఎందుకు?

## IV

ఈ నాటికలు వ్రాసిన చిరకాలానికి ప్రచురించటానికి కారణం రచయిత కాదని మనవి. ఈ నాటికల రచనకు మిత్రశ్రీ డాక్టర్ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం ముఖ్య ప్రేరకుడు. రచనను ప్రోత్సహించి చేసిన తప్పుకు ముద్రణభారం వహించి, ప్రచురించటం నిష్కృతి కాబోలు.

## V

ఈ ఏకాంకికలు చదివి, ఎవరూ విలువగల తమ కాలాన్ని వెచ్చించవద్దని రచయిత హృదయపూర్వకమైన మనవి. ఒకవేళ పొరపాటున చదివినా ప్రదర్శించుటకు పూను కోవద్దని రచయిత సలహా. ప్రదర్శించేవారు తమకాలాన్నే గాక ప్రేక్షకుల అమూల్య కాలమునుగూడ దుర్వినియోగం చేసినవారవుతారని, అందుకు రచయిత ఎంతమాత్రమూ బాధ్యుడు కాదని హెచ్చరించుచున్నాను.

**నండూరి రామకృష్ణమాచార్య**

# బ్రహ్మనాయని స్వగతం

సమయం

పలనాటి యుద్ధంలో కడపటిదినం : తొలియుషస్సులు.

స్థలం

కార్యమపూడి కదనరంగం : బొమ్మలడేరా.

కత్తి, డాలు సంఘములకు వేలాడుచుండును. నల్లచేవబల్ల, దూది, మైనంతో చేసిన కోడిపుంజు బొమ్మ. కొమ్మరాజు, అలరాజు, బాలచంద్రుడు, కన్నమదాసు, మలిదేవుడు, ఆనుగురాజు, దొడ్డనాయుడు మున్నగు పలనాటి యోధుల చిత్రఫలకాలు డేరా చుట్టు గోడల వ్రేలాడుచుండును. ఎత్తుబల్లపై చెన్న కేశవ ప్రతిమ. క్రింద ఆళ్వారాదుల విగ్రహాలు, భగవద్ రామానుజ విగ్రహం.

(తెరలో)

సుదూరంగా నవుబత్తు, ఝంజలు, రుద్రవీణ, భేరీ, కాహళ నినాదాలు, శంఖతూర్య రావాలు వినిపించుచుండును. 'కొక్కురో కో', తొలి కూడికూత ప్రస్ఫుటంగా వినిపిస్తుంది.

**మేలుకో బ్రహ్మయ్య మేలుకోవయ్య!**
**బాలచంద్రుని గన్న పలనాటివీర!**
**బాస దబ్బరగండ! బ్రహ్మనాయకుడ!**
**మేలుకో బ్రహ్మయ్య మేలుకోవయ్య!**
**మేలుకొని రణభూమి నేలుకోవయ్య!**

**కార్తవీర్యుని నాటి కంచు ఢంకాలు**
**ఝంజలు సషిరీలు రుద్రవీణలును**
**దుందుభీ జయశంఖ తూర్య రావములు**
**మిన్నంది మ్రోగెను మిగుల వాద్యములు ॥మే॥**

**విచ్చుకత్తులవారు వీరనాయకులు**

**బాకులవారును బరిసెలవారు**
**మన్నీలు రౌతులు మావంతులెల్ల**
**యుద్ధసన్నద్ధులై ఉబుకుచున్నారు. ॥మే॥**

బ్రహ్మనాయని ప్రవేశం

బ్రహ్మనాయుడు ప్రవేశించి చెన్న కేశవప్రతిమముందు నిమీలిత నేత్రుడై ప్రార్థాంజలి ఘటించి కొన్ని నిమేషములు నిలిచి పిమ్మట ఆహార్యధారణకు ఉపక్రమించును.

తెరలో

ప్రబోధగీతిక వినుపించుచుండ యథోచిత వేషధారణ సల్పును.

**కదలిరావయ్య ఓ గండరగండ**
**కదనరంగమునకు కల్యాణరీవి**
**పట్టుటి జారును బాగుగా తోడిగి**
**కాసెమీదను వీరకాసె బిగియించి**
**చుక్కల తలపాగ సొగసుగా తీర్చి**
**చంద్రకాంత రుమాల చెలువుగా గట్టి**
**పచ్చపువ్వులబంతి, పసిడిబాసికము**
**మోకాలి ఝుల్లియు మోచిక్క ములను**
**కాలికి బిరుదందె ఘనముగా గట్టి**
**ఆయుధమ్ములుపూని ఆయత్తపడుము**
**బాలచంద్రుని గన్న పలనాటి వీర**
**బాసదబ్బరగండ బ్రహ్మనాయకుడ**
**కదలిరావయ నేటి కడసారి అనికి,**

'కొక్కు రో కో' కోడికూత మూడుమారు వినిపించును

బ్రహ్మనాయుడు

తొలిఉషస్సులలో ముక్తకంఠంతో నిద్రాముద్రిత జగత్తుకు మేలుకొలుపు పలికే కోడిపుంజు కుత్తుకలో, ప్రస్ఫుట పుంస్కుక్కుట కంఠనాళాలలో పుడమి కవ్వలి వెల్గులు చూచి

పులకించి ఉషస్సూక్తాల ఆలపించిన మంత్రద్రష్టలు, క్రాంతదర్శులైన మహర్షికుమారుల ఋగుజ్వలనాదబిందు కళోపాసన ఇమిడి యున్నది. ఎన్నిసారులు వినినప్పటికీ, ఎప్పటికప్పుడు సృష్ట్యాదినుండి ప్రతి ప్రభాతములో వినిపించే ఈ నిత్యనూతన జగన్నాటక నవోదయ నాందీగీతిక నవనవోన్మేష నిత్యవైతాళిక సుప్రభాతం ఆలపించే పుంస్కుక్కుట వీరకుమారక ముక్తకంఠం వీనుదోయికి నిత్య ప్రత్యగ్రంగానే వినిపిస్తుంది. ఎన్నో మారులు విన్న ఈ తొలి కోడికూత ఈనాడు విన్నప్పుడు ఏలకో నా హృదయం పులకాంకుర ప్రకరాలతో పొంగి, ఉప్పొంగి, ఉప్పెనలో చెలియలి కట్టదాటిన మహోదధివలె వెల్లివిరియుచున్నది.

అవును:

నేడు పలనాటి యుద్ధంలో ఈ కార్యమపూడి కదన క్షేత్రంలో అంతిమప్రభాతం. నా బ్రదుకు తుది ప్రొద్దు వెలుగులో ఇది తుది తొలిప్రొద్దుపొడుపు కావచ్చు. నిరీక్షించుచున్నానుగదా నా యావజ్జీవితకాలం, ఈనాటి తొలికోడి కూతకై!

ఎన్నాళ్లకు! ఎన్నాళ్లకు వినిపించింది ఈ తుది మేలుకొలుపు.

తెరలో

'కొక్కు రో కో' కోడికూత

అవును. కోడిపుంజ కోమలగంభీరమంజు మంజుల కంఠరావం, నిద్రాణజగజ్జాగృతిసుభగసుప్రభాతభేరీ! సుప్ర హృదయ గుప్త సౌహృద చైతన్య కల్లోలినీ వర్తులావర్త పరి వర్తిత వాస నోస్సలితం! ఏమి! పలనాటిని శ్మశానవాటిని చేసినది కోడిపందాలేనా? నిర్జీవద్యూతం అలనాడు కురుపాండవ వంశక్షయ మొనర్చిన కురుక్షేత్ర సంగ్రామమునకూ, నేడు సజీవద్యూతక్రీడ - కోడిపందాలు – హైహయ వంశక్షయ మొనర్చుచున్న పలనాటి

యుద్ధమునకూ మూల హేతువులని చరిత్రకారులు తీర్పు తీర్చగలరు కాబోలు! అలనాడు అజాత శత్రువు ధర్మరాజచంద్రునిలో ఒకమచ్చ అతని ద్యూతప్రీతి. నేడు బ్రహ్మనాయని శీలములో కోడిపందాలపై మోజు మాయని మచ్చ. ఎందుకా నా కీ అసమయ నిర్వేదం! అనవసర హృదయ వైక్లబ్యం! కురుక్షేత్రసంగ్రామానికి అసలు కారణం ద్యూతంకాదు. హేతు హేతుమత్ భావం తలక్రిందులు చేయు చున్నారు తాత్త్విక మ్మన్యులు, మానవహృదయం క్షీరసాగరం వలె మథించి ముక్కాకలు తీరిన ముగ్గినపండుకు నా కీ సందేహం ఎందుకు?

అలనాడు ద్యూతక్రీడ వట్టి మిష. కురుపాండవ వైర ఫలితము ద్యూతము ద్యూతమువలన వైరము రాలేదు. కురుక్షేత్రసంగ్రామం ధర్మరాజు జూదం ఆడకపోయినా దాయాదుల వైరానుగుణంగా అవశ్యభావిత్వమై దాపురించేదే. కోడిపందాలు ఆడకపోతే మాత్రం పలనాటియుద్ధం సంభవింపకుండా ఉండేదా! ఎంతటి వైరి! లీలామానువ విగ్రహుడు శ్రీకృష్ణభగవానుడే దాయాదులకు పొత్తు కుదర్చ లేక పోయినాడే! ఎంతటివెర్రి ! మానవస్వభావం మారితేగాని, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య వివశులుగాని మానవులు ఉద్భవించినగాని యుద్ధసంక్షోభము తప్పదేమో! మానవస్వభావం కుక్కతోకవంటిది!

ఎందరో మహానుభావులు, మహామహితాత్ములు, మహాకవీశ్వరులు, మహామనీషులు, తార్కికులు, తత్త్వవేత్తలు, వేద వేదాంగపారంగతులు, వివిధ వేదాంత వేదులు యుగయుగాంతరాలుగా తరతరాలుగా ఉద్భవించి, ఈ కుక్కతోకవంకర సరిదిద్దవలెనని చిత్తశుద్ధితో యత్నించి ప్రయత్నించి విఫల మనోరథులై విశాల విశ్వచరిత్రలో విస్మృతి పథాలలో నిష్క్ర మించినారు.

అవును. కోడిపుంజులపై నింద మోపి, నేను నిర్దోషిగా నిలబడగలనా?

అదీగాక, కోడిపుంజులోని పౌరుషం, మగసిరి ఏ వీరాధివీరులలో కనిపిస్తుంది! ఈ పృథివిలో, స్థావర జంగ మాత్మక మైన ఈ సువిశాలసృష్టిలో, పౌరుష పరాక్రమో పేతమైన వీర రసం కరడుగట్టింది కోడిపుంజురూపంలోనే!

ఒళ్లంతా కుమిలి గాయాలైనా, కళ్లుపోయినా, కాళ్లు విరిగినా, కండలు ఊడి ప్రేగులు తెగి రక్తనాళాలు వేలాడుతున్నా, ఈకలో ప్రాణమున్నంతవరకూ రోసంతో పోరాడే కోడిపుంజు వీరాధివీరులందరకూ నిజమైన ఆరాధ్యదైవం.

వాసనారూపంగానైనా నా హృదయాంతరాళాలలో వీర రసావేశంలేని పారుబోతులు, పూర్వజన్మలోగూడ ఎత్తినకత్తి చూచియుండని పిరికిపందలు కోడిపందాలను గర్హించిన గర్హింప వచ్చుగాక! వీరులు తమ గుండెలో వెన్నెల కోవెల కట్టి ఆరాధించదగినది కోడిపుంజు.

కోడిపుంజుపై నా కున్న గౌరవ ప్రపత్తులు, కోడిపందాలపై నా కున్నప్రీతి నా శరీరంలో ప్రతిరక్త బిందువును ఉప్పొంగ జేయగలవే! ఏల కాదనవలె! కోడిపందాలపై తనకు గల ప్రీతికి బ్రహ్మనాయుడు మరణశయ్యపైగూడ పశ్చాత్తాపము నొందడే! ధీరోదాత్తుడుగా, లోకోత్తర ధర్మవీరుడుగా, సత్యసంధుడుగా, అజాతశత్రువుగా, పరమాత్మకు ప్రతిబింబంగా ఉండదగిన మానవునిలోనే యెంతనైచ్యం దాగొని ఉన్నది!

మనిషిలో ఉన్నవిషం ఏ నాగుపాములో ఉన్నది! గాడిదకు వెనుక, గుర్రముకు ముందు జాగ్రత్తపడవలెనట; కాని మనిషికి నాలుగుప్రక్కల జాగ్రత్తపడినా చాలదే! జిత్తులమారి ఏ గుంటనక్కలో, క్రుళ్లినశవాలను పీకు కొనితినే

ఏ రాబందులో, మట్టిలో పొరలుతూ వెన్నెముక లేకుండా బ్రదికే ఏ వానపాములో మనిషిలో ఉన్న నిక్రుష్టత ఉన్నది! మనిషి సర్వజాంతవనైచ్యసమాహారం. ద్విపాత్తులోని నిక్రుష్టత ఏ చతుష్పాత్తులోనూ లేదు. ధర్మయుద్ధంలో ఆత్మ బలిదానం చేసిన వీరుడు - వీరస్వర్గం అలంకరించటమేగాదు మానవస్వభావ స్వరూప ప్రకృతులనే పవిత్రం చేయగలడు.

కోడిపుంజు పౌరుషం ఉగ్గడింపదగింది!

*బాలచంద్రుని చిత్రఫలకంముందు నిలిచి*

నాయనా! బాలచంద్రా! నీవు కోడిపుంజువంటి కొడుకువు. తండ్రిని మించిన పుత్రుడవు. దుర్భాష లాడి నీ మనసు నొప్పించినానే! నా పాపానికి నివృత్తి ఉన్నదా తండ్రీ! నిన్ను యుద్ధానికి నేను రమ్మనలేదు. కారణం?

ఏకైక సుతుడు బదికియుండవలెనని కాదురా! నేనమరోనిన్నట్లే తుది ఘడియలలో పిరికి నాగమ్మ, పాపం, నరసింగరాజును మనకు కులపగగా సమర్పించే సంధికి సంసిద్ధమైనది. కాని, అనుకోకుండా బాలచంద్రా! ఆకాశంనుండి ఆకస్మికంగా ఊడిపడిన చిచ్చరపిడుగువలె నీవు ప్రత్యక్షమైనావు ఈ కార్యమపూడి కదనరంగంలో. మేమందరం నెత్తిమీద పెట్టుకొని ఊరేగదలచిన సంధిని ఎడంకాలితో బంతిని తన్నినట్లు తన్ని ధీరోదాత్తనాయకుడవై దేదీప్యమానంగా వెలిగిన జగదేకవీరుడవు! తండ్రీ బాలచంద్రా!

నీవు, భారతదేశంలో వీరులవంగడం నశించకుండా ఉండేందుకు నా కడుపున ఉద్భవించిన కారణజన్ముడవు. పలనాటి పౌరుషం, తెలుగుల పరాక్రమం ఆదర్శప్రేరితులైన యువభారతవీరుల నిత్యప్రత్యగ్రధీరోదాత్తతల నిర్వికల్ప పౌనఃపున్యమే నీ పవిత్ర నామాక్షరాలుగ చరిత్రలో చిర

స్మరణీయం కాగలవు. బాలచంద్రా! నీవు తండ్రికి తగిన పుత్రుడవు. ఏమంటిని! నాయనా! ఇదుగో బ్రహ్మనాయుడు కత్తి పట్టుకొని ప్రమాణం చేయుచున్నాడు, బాలచంద్రునివంటి పుత్రునకు తగిన తండ్రి నని పించుకొనుటకే! నాయనా! బాలచంద్రా! నినుకన్న జననియిత్రి ఐతాంబ నిజమైన వీరమాత.

కొమ్మరాజు చిత్రమునకు నమస్కరించి

కొమ్మరాజా! నీకు నా సమోవాకములు!

పలనాటి వియ్యంకుడు, కొమ్మరాజు ప్రతిరక్త బిందువులో, ప్రత్యణువులో శాంతవీరములు గంగాయమునల వలె సంగమించిన సంగతి జగద్విదితము.

మహాభాగా! నా శాంతిప్రీతికి, నీ అనుగు సుతుడు, పలనాటి అల్లుడు అలరాజును బలిపెట్టినానే. మహా పతివ్రతామతల్లి, తెలుగుల అనుగు చెల్లెలు, పేరంటాలు పేరమ్మ సహగమనము చేసిన చితి నాగుండెలో ఆరక మండుచున్నదే! ఆ జగద్బాంధవుడు అపరకృష్ణుడు. కాదు, అతికృష్ణుడు. ఆల రాజు రాయబారియై ఆత్మబలిదాన మొనర్చినాడే! నా పాప మునకు నివృత్తి ఉన్నదా! కొడుకు బాలచంద్రుని ఇల్లడ పెట్టి, నా బాస దబ్బర చేసినాను. కాని కొమ్మరాజా! ఉగ్గడింపదగిన ఔదార్యముతో నీవు నన్ను మన్నించినావు. మన్నించుటే కాదు. జగత్పితవై, 'నా పుత్రుడు అలరాజు మరణించెను. పోని, ఇతరుల పుత్రులైన బ్రదుకుదురుగాక!' అని సంధికి సమ్మతించినావే! నీవు క్షమించిన క్షమించెదవుగాక, బాసతప్పిన నన్ను భగవంతుడు క్షమింపగలడా? అవును. బాలచంద్రుడు బాసదబ్బరగండ బిరుదాంకితుడైన తండ్రి బ్రహ్మనాయని బాస దబ్బరగుకుండా తానే స్వచ్ఛందముగ తండ్రి బాస సార్ధకముచేసి కదనరంగమున దూకి నరసింగరాజు శిరము

ఖండించి అటు అలరాజుకు రక్తతర్పణము, ఇటు నా పాపమునకు నిష్కృతి ఏకా క్రియాద్వ్యర్థకరీ యొనర్చినాడు. కొమ్మరాజా! నా శాంతిప్రీతి, కాదు, నా హృదయ దౌర్బల్యమే నీకు పిరికిమందు పోయలేకపోయినది. బాల చంద్రుడుగాదు పలనాటి యుద్ధమునకు నాందీపూజ సల్పినది. వీరాధివీరుడై, జగదేకధానుష్కుడై తొలియలుగును విడిచి గురితప్పని లక్ష్య శుద్ధితో నలగాముడేరామీది పూర్ణకలశము తుత్తునియలుగ ఖండించి నల్లడల చెల్లాచెదరై నేలపై దొరలేటట్లు కూల్చినావు. నీకు నా హృదయపూర్వక సమోవాకాలు. నీతోపాటు పలనాటి పౌరుష ప్రదీప్తులు దిగ్గంతరాళాల వెల్గించి ఆహవరంగమున అసువు లర్పించిన అజ్ఞాత సైనిక సమూహమునకు నా జోహారులు.

బాలచంద్రునిమించి నన్ను ప్రేమించిన కన్నమదాసా! నీ చిత్రఫలకమును చూడలేను. నీవు నా మానసపుత్రుడవు. నా అభిప్రాయాలు మాటలు తెలుపలేవు. మౌనమే నాకు శరణ్యము.

ప్రభూ! మలిదేవమహారాజా! నీవుకూడ అసువులు వీడినావే! ఇంకేల నా కీ యుద్ధము, కాదు, మహారాజా! నీకూ, వీరస్వర్గమలంకరించిన పలనాటి వీరకోటికి నా కవోష్ణ రుధిరధారలతో నివాపాంజలులు సమరించుటకే సంగ్రామము కొనసాగించుచున్నాను.

తండ్రీ! చెన్న కేశవా! హే జగన్నాటక సూత్రధారీ! నవరససంభరితమైన యీ రమణీయ భయానక నాటకంలో నా కీ పాత్ర ఎందుకు అనుగ్రహించినావు? ప్రభూ! చెన్న కేశవా! వీరరసప్రధానమై హృదయవిదారకమై వేదనాదోదూయమాన విషాదాంత బీభత్సభయాన కాద్భుత శతసహస్ర వివిధవిభావాను భావాక్రాంత సంక్రాంతమై కన్నవారినీ విన్నవారినీ విభ్రాంత చేతస్కులచేసే యీవిషాదవిప్లవ విశిష్ట విచిత్రపాత్ర ఇంకెవ్వరూ ధరింపనేరరని నాకు ప్రసాదించి

నావా? హే జగన్నాటక సూత్రధారీ! సరే. నీ సంకల్పమునకు వికల్పమే లేదు. తండ్రీ చెన్న కేశవా! మథియింపుము, మథియింపుము నా మనస్సు మందరగిరివై; హాలాహలము ఉద్భవించునని భయమేల ప్రభూ! ఎట్టకేలకు అమృతమును ఉద్భవింపచేసి అందు నా మనోక్షీర సాగరమువై వటపత్రశాయివై శయనింపుము.

రామానుజ విగ్రహముముందు నిలిచి

శ్రీమతే రామానుజాయనమః. యతిరాజా ! ఆళ్వారుల ఆదర్శములు శిరసావహించి, కన్నమదాసును ధర్మపుత్రునిగా స్వీకరించి బాలచంద్రునితోపాటు మనసార పెంచినాను. చెన్న కేశవపాదారవింద మకరంద పానమత్తేందీవరమునై కులభేదములకు హృదయపూర్వకముగా స్వస్తిచెప్పి, నా హృదయ కవాటములతోపాటు చెన్న కేశవ దేవాలయద్వారాలు భక్తులందరకూ ప్రవేశింప వీలగునట్లు తెరచి, పులకించి తరించినాను. వీరులందరిదీ ఒకే కులము. కాదు, మానవులందరిదీ ఒకేకులం. సైనికులందరకూ నా సహపంక్తిని భోజనముపెట్టి, వారు భుజించి తేల్చినప్పుడు నా కడుపు నిండి ఆకలి తీరినదని ఆనంద తన్మయత్వములో మురిసిపోయినాను. చాపకూడులో, ఆళ్వారు లందరకూ అభి వాదాలుసలిపి మొదటివిస్తరిలో కూర్చొని, మానవులందరు నా సోదరులని, ఇక జన్మరాహిత్యమైనదని సంతోపించినాను. యతిరాజగురుదేవా! నీ దాసునిపై కరుణాకటాక్ష వీక్షణములు బరపి చిత్తశాంతి నను గ్రహింపుము.

భగవన్! ఇది కదనరంగమున కట్టకడపటి ప్రొద్దు. ఇక కత్తిదూసి కదనరంగములోనికి దూకుటయే నా కర్తవ్యము. తెల్లవారినది. భగవన్ సూర్యనారాయణా! నీకు నా నమస్సులు. శిష్టరక్షణమేగాక దుష్టశిక్షణముగూడ పవిత్రకర్తవ్యమే. భగవన్! రామానుజ! సెలవు. అదుగో, ప్రభాతరణభేరీ! శ్రవఃపేయమై సంగ్రామరంగమునకు స్వాగత

వాదము పలికి ఆహ్వానించుచున్నది. భగవన్! బ్రదికితినా భగవంతుడు బ్రహ్మనాయనిచెంత చేరగలడు. లేదా, బ్రహ్మనాయుడు భగవంతునిచెంత చేరగలడు!

జై! పలనాటి యోధులకు జై!

కత్తి, డాలు పుచ్చుకొని బ్రహ్మనాయుడు నిష్క్రమించును.

తెర